ఆదర్శ కళాశాల



జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల సత్ఫలితాలనిస్తోంది. ఇక్కడ చదివిన విద్యార్థులు జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీజీ సీట్లకు ఎంపికవుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి స్కాలర్ షిప్‌కోసం ఎస్సీ విద్యార్థులు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి సునీతాకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు 9440628538 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'సమగ్ర' ఉద్యోగుల సత్యాగ్రహదీక్ష



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: రెగ్యులరైజ్ చేయాలని 22రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, కోశాధికారి వెంకటి, నాయకులు రాకేశ్, పార్థసారథి, ప్రవీణ్, సోమన్న, చిరంజీవి, హిమబిందు, రేణుక, జయలలిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై ప్రచారం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో బీఎల్వోలు, అధికారులు మంగళవారం ఇంటింటా తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని డీవైఎస్వో వెంకటేశ్వర్లు సూచించారు. మెప్మా మేనేజర్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్లు భాగ్యలక్ష్మి, అశోక్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్వహణకు ప్రత్యామ్నాయ చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలో ఉండడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు జిల్లా సంక్షేమాధికారి మిల్కా ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ పరిధిలో కౌన్సిలర్ల ద్వారా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జీ ఆర్పీల ద్వారా వంట చేయించి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రీస్కూల్ తరగతులు టీ-శాట్ ద్వారా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

జాతీయ మహాసభల్లో జిల్లా నేతలు



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: తమిళనాడు రాష్ట్రంలోని నమక్కల్ జిల్లాలో నిర్వహిస్తున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ మహాసభల్లో ఉమ్మడి జిల్లా టీఏజీఎస్ నేతలు పూసం సచిన్, తొడసం భీంరావ్, లంకా రాఘవులు, తొడసం శంబు, ఏర్‌పెల్లి అశోక్, మాలశ్రీ, భైరి సోమేశ్ తదితరులు పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం నివాళులర్పించారు.

రెండోరోజుకు ఎమ్మార్పీఎస్ దీక్ష

కైలాస్‌నగర్: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరింది. దీక్షకు మహాజన సోషలిస్ట్ పార్టీ, వికలాంగుల హక్కుల పోరాట సమితి, మాదిగ ఉద్యోగుల సమాఖ్య మద్దతు తెలిపాయి. వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు ఆరెల్లి మల్లేశ్, సుభాష్, మధుకర్, ప్రేంరాజు, గంగయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కాలనీవాసులు

నార్నూర్: తాగునీటి సౌకర్యం కల్పించాలని మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామ ఎస్టీ కాలనీవాసులు ఖాళీ బిందెలు ప్రదర్శిస్తూ రాస్తారోకో చేశారు. మూడుగంటల పాటు రోడ్డుపై బైఠాయించగా ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్సైలు రవికిరణ్, మహేశ్‌కుమార్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులను సముదాయించినా ససేమిరా అన్నారు. ఈక్రమంలో ఆందోళనకారులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాలనీవాసులు విద్యారాణి, సోరాజీ జాదవ్ తాగునీటి కష్టాలు వివరించారు. పోలీసులు స్థానిక సర్పంచ్‌తో మాట్లాడగా.. రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. యూత్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కొలువుదీరిన వినాయకుడు



జిల్లా కేంద్రంలో ఏకదంతుడికి పూజలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు



జిల్లా కేంద్రంలో గణపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామన్న దంపతులు



ఇంద్రవెల్లి: దనోరా (బీ)లో లంబోదరుడి పూజలో ఎమ్మెల్యే రేఖానాయక్

జిల్లా వ్యాప్తంగా సోమవారం గణేశ్ నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణేశుడి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో నెలకొల్పారు. చిన్నాపెద్దా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉత్సవాలు మంగళవారం రెండోరోజుకు చేరగా లంబోదరుడు భక్తుల పూజలందుకున్నాడు. – ఆదిలాబాద్

పర్యావరణ హిత.. సెల్ఫీ విత్ గణేశ్



ఆదిలాబాద్: పర్యావరణాన్ని కాపాడే రీతిలో, విభిన్న ఆకృతుల్లో అపార్ట్‌మెంట్లు, యువజన సంఘాలు, ఇళ్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణేశులకు సంబంధించి 'సాక్షి' 'పర్యావరణ హిత.. సెల్ఫీ విత్ గణేశ్' పేరిట ఫొటోలను ఆహ్వానిస్తోంది. వినాయక ప్రతిమలతో తీసుకున్న సెల్ఫీ ఫొటోలను బుధవారం సాయంత్రం 4గంటల వరకు **73964 99274** నంబర్‌కు వాట్సాప్‌లో పంపించాలి.

గణేశ్ మండలి పేరు, ఇంట్లో అయితే మీ పేరు, గ్రామం, మండలం వివరాలు పంపించాలి.



'ఆమె'దే పైచేయి..!



రిజర్వేషన్లతో మహిళలకు స్వేచ్ఛ

– ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లతో వారి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, హక్కులకు అవకాశం కల్పించినట్లవుతుందని ఎంపీ సోయం బాపూరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలుపడంపై హర్షం వ్యక్తంజేశారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావడంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడుతోందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కారణంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు వస్తుందని బీఆర్ఎస్ గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలోని అసెంబ్లీ స్థానాలు, మంత్రి పదవుల్లోనూ మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

- ఉమ్మడి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారి ఓట్లే అధికం
- పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మూడింట్లో పురుషులు కాస్త ఎక్కువ
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ తీర్మానం
- కీలకంగా మారనున్న మహిళా ఓటర్లు

సాక్షి, ఆదిలాబాద్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కేంద్ర కేబినెట్ సోమవారం తీర్మానం చేసిన నేపథ్యంలో అంతటా దీనిపైనే చర్చ జరుగుతోంది. నూతన పార్లమెంట్ భవనంలో ఈ చారిత్రక బిల్లును మంగళవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. దీనిపై చర్చల అనంతరం చట్టం కార్యరూపం దాల్చేది స్పష్టమవుతుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల పరిస్థితిని పరిశీలిస్తే..

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సిర్పూర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ లోకసభ పరిధిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. అత్యధికంగా నిర్మల్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లుండగా, ఆ తర్వాత ముథోల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాలోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

పెద్దపల్లి పరిధిలో..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి మంచిర్యాలతో పాటు జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, మంథని, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ లోకసభ పరిధిలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అయితే స్వల్పంగా వంద ఓట్ల తేడా మాత్రమే ఉండటం గమనార్హం. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. మంథని, పెద్దపల్లి, ధర్మపురిలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పురుష ఓటర్లు 7,41,238 మంది ఉండగా, మహిళా ఓటర్లు 7,41,368 మంది ఉన్నారు.

బిల్లు ఆమోదం పొందితే..

మహిళా రిజర్వేషన్లకు సంబంధించి బిల్లు ఆమోదం పొందితే దేశ వ్యాప్తంగా లోకసభ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళలకు 33 శాతం చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మహిళా జనాభాకు అనుగుణంగా ఈ ప్రాతినిధ్యం మేరకు నియోజకవర్గాలను రిజర్వ్ చేస్తారు. దీంతోనే ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యపై జోరుగా చర్చ సాగుతోంది. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ ఉండగా, ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు చెన్నూర్, బెల్లంపల్లి ఉన్నాయి. మిగతా నియోజకవర్గాలు జనరల్‌గా ఉన్నాయి. ఈ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లోనూ మహిళా జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్ల నిష్పత్తిపై కూడా సమీకరణాలు మొదలయ్యాయి.

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ ఓటర్ల వివరాలు..

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్స్	మొత్తం
సిర్పూర్	1,09,349	1,07,902	09	2,17,260
ఆసిఫాబాద్	1,07,128	1,06,847	16	2,13,991
ఆదిలాబాద్	1,12,888	1,16,120	07	2,29,015
బోథ్	1,00,052	1,04,421	03	2,04,476
ఖానాపూర్	1,03,222	1,06,490	13	2,09,725
నిర్మల్	1,12,612	1,24,706	14	2,37,332
ముథోల్	1,15,000	1,20,840	18	2,35,858
మొత్తం	7,60,251	7,87,326	80	15,47,657

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్స్	మొత్తం
చెన్నూర్	89,176	88,443	09	1,77,628
బెల్లంపల్లి	81,345	80,550	13	1,61,908
మంచిర్యాల	1,25,609	1,24,829	20	2,50,458

సంతోషంగా ఉంది



ఇంద్రవెల్లి: మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం సంతోషంగా ఉంది. మహిళలు చేసిన పోరాటానికి ఫలితం దక్కింది. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ఇదొక శుభ పరిణామంగా భావిస్తున్నాను. – కుమ్ర ఈశ్వరీబాయి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు

మహిళాలోకం గర్వపడే బిల్లు



బోథ్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తే ప్రతీ రాష్ట్రంలో 33శాతం మంది ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికవుతారు. దీంతో రాజ్యాధికారం దిశగా మహిళలు అడుగులు వేయవచ్చు. ఇది మహిళాలోకం గర్వపడే బిల్లు. – సంధ్యారాణి, బోథ్ జెడ్పీటీసీ సభ్యురాలు

మహిళా చట్టాలు బలోపేతం



బోథ్: మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం హర్షణీయం. చట్టసభల్లో మహిళల సమస్యలు చెప్పుకొనే, చట్టాలు చేసే అవకాశం లభించనుంది. మహిళా చట్టాలను బలోపేతం చేసే అవకాశం కూడా ఉంటుంది. – చట్ల రజిని, బోథ్ ఎంపీటీసీ సభ్యురాలు

ఉపకరణాల లబ్ధిదారుల జాబితా ఎంపిక

కైలాస్‌నగర్: సహాయ ఉపకరణాలకు గత ఏప్రిల్‌లో దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను జిల్లా సంక్షేమాధికారి, మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ నోటీస్‌బోర్డుపై ఉంచినట్లు ఆ శాఖ అధికారి మిల్కా ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు జాబితాపై సందేహాలు, అభ్యంతరాలుంటే బుధవారం నుంచి 10రోజుల్లో లిఖితపూర్వకంగా కార్యాలయంలో తెలుపాలని సూచించారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ

- 37మంది హెచ్‌ఎంలకు స్థానచలనం
- 48మంది ఎస్‌ఏలకు ప్రమోషన్ ఛాన్స్



ప్రక్రియ నిర్వహిస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: ఎట్టకేలకు జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఇదివరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్న జెడ్పీ, ప్రభుత్వ యాజమాన్య ప్రధానోపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. జెడ్పీ యాజమాన్యం పరిధిలో 35మంది, ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో ఇద్దరు బదిలీ కాగా, ఆన్‌లైన్ నుంచి ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకుని విధుల్లో చేరారు. ప్రభుత్వ పరిధిలో నిజామాబాద్ జిల్లా నుంచి ఒకరు, జెడ్పీ యాజమాన్యం పరిధిలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఇద్దరు బదిలీపై ఈ జిల్లాకు వచ్చారు.

48మందికి హెచ్‌ఎంలుగా పదోన్నతి!

హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ ముగియగా అధికారులు పదోన్నతుల కోసం వెకెన్సీలు సిద్ధం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా గురువారం పదోన్నతులు కల్పించనున్నారు. బుధవారం నుంచి ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. జెడ్పీ యాజమాన్య పరిధిలో 41 మందికి, ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు లభించనున్నాయి. ఈ ప్రక్రియ తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ ప్రక్రియ, ఆ తర్వాత ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నారు. అక్టోబర్ 5 వరకు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఫిబ్రవరిలో బదిలీలు, పదోన్నతులు జరగాల్సి ఉండగా కొందరు ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిన విషయం తెలిసిందే. హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ రాగా ప్రక్రియ ముందుకు సాగుతోంది. కాగా, ప్రక్రియను డీఈవో ప్రణీత, ఏడీ నర్సింహులు, సిబ్బంది తుషార్, సతీశ్, శ్రీహరిబాబు, పూర్ణచందర్ తదితరులు నిర్వహిస్తున్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులు



వ్యాధిగ్రస్తులకు సరుకులు ఇస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీబీ కార్యాలయంలో మంగళవారం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నిక్షయ మిత్రుల సహకారంతో వ్యాధిగ్రస్తులకు సరుకులు అందించినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులు కోలుకునేదాకా పౌష్టికాహారం అందించేందుకు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా రోగులకు న్యూట్రిషియన్ కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. లక్షణాలున్నవారు వెంటనే సమీప పీహెచ్‌సీలు, టీబీ కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆర్నెళ్ల మందులు వాడితే నయమవుతుందని తెలిపారు. జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీకాంత్, మెడికల్ అధికారి సాయిప్రియ, తెలంగాణ ప్రజా వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, సూపర్‌వైజర్ రమేశ్, నాగభూషణం, నవీన్, మోసిన్ తదితరులున్నారు.

'మహాయజ్ఞం' విజయవంతం చేయాలి

ఆదిలాబాద్: వచ్చే ఏడాది జనవరి 21న తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో నిర్వహించనున్న కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత హనుమాన్ దీక్ష సేవా సమితి పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌసింగ్‌బోర్డు కాలనీలో గల మాధవ నిలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ధర్మాచార్యులు వేంకటేశ్వరస్వామి రథ యాత్రలో ప్రయాణం చేసి గ్రామగ్రామాన పర్యటిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 23న సాయంత్రం 6గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతోపాటు పీఠాధిపతుల అనుగ్రహ భాషణం ఉంటుందని తెలిపారు. గురు, శుక్రవారాల్లో జిల్లా కేంద్రంలోని వినాయక మండపాల వద్ద రథ సందర్శన ఉంటుందని వివరించారు. కార్యక్రమాల్లో హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

'మట్టి ప్రతిమలే శ్రేయస్కరం'

ఆదిలాబాద్: పర్యావరణహితమైన మట్టి వినాయక ప్రతిమలను నెలకొల్పడం ఎంతో శ్రేయస్కరమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తులకు మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలతో పర్యావరణానికి హాని జరుగుతుందని పేర్కొన్నారు. పీవోపీ ప్రతిమలను నిమజ్జనం చేస్తే జలాలు కలుషితం కావడంతోపాటు జలచరాలు మరణిస్తాయని తెలిపారు. సమితి ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తుండడం హర్షణీయమని పేర్కొన్నారు. మఠాధిపతి యోగానంద సరస్వతీస్వామి, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి, గెడం మాధవ్ తదితరులున్నారు.

ప్రకృతి గీసిన చిత్రం..!



జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామ సమీపంలోని లక్ష్మీపూర్ రిజర్వాయర్ ఇటీవలి వర్షాలకు 153 టీఎంసీల నీటితో నిండుకుండను తలపిస్తోంది. సూర్యాస్తమయ వేళ రిజర్వాయర్ అందాలు అదరహో.. అనిపిస్తున్నాయి. చుట్టూ పచ్చటి చెట్లు, నీటిలో ప్రతిబింబించిన నీలి ఆకాశం చూపరులకు కనువిందు చేస్తున్నాయి. మంగళవారం సాయంత్రం తీసిన చిత్రమిది. – జైనథ్

క్లుప్తంగా

రెండు సెల్‌ఫోన్ల చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం మహాలక్ష్మివాడలోని చింతర్ కృష్ణకు చెందిన రెండు సెల్‌ఫోన్‌లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణ తన ఇంట్లో నిద్రపోతున్న సమయంలో రెండు ఫోన్‌లను చార్జింగ్ పెట్టాడు. ఉదయం 4గంటల సమయంలో చిల్కూరి లక్ష్మినగర్‌కు చెందిన సమీర్ అనే వ్యక్తి ఎత్తుకెళ్లినట్లు గమనించాడు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

రైతుబజార్‌లో..

పట్టణంలోని కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వినియోగదారుడి సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌లో మంగళవారం చోటుచేసుకుంది. మావల మండల కేంద్రానికి చెందిన బండారి శ్రీనివాస్ కూరగాయలు కొనుగోలు చేసే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి పాల్పడ్డాడు ఐఎంఈఐ నంబర్లతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా బాధితుడు పేర్కొన్నారు.

ధనోర పల్లెదవాఖానకు ఎన్‌క్వాస్ గుర్తింపు

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర పల్లె దవాఖానకు ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్) గుర్తింపు లభించింది. ఇప్పటికే భీంపూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అందర్‌బంద్, అర్లి(టి) పల్లె దవాఖానాలు రెండు నెలల క్రితం ఎన్‌క్వాస్ గుర్తింపును సాధించాయి. తాజాగా ధనోర పల్లె దవాఖానా సైతం గుర్తింపు సాధించడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ధనోర పల్లె దవాఖానాను ఎన్‌క్వాస్ బృందం సభ్యులు ఆగస్టు 18వ తేదీన పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ధనోర ఆరోగ్య ఉపకేంద్రం 85శాతం మార్కులు సాధించి ఎన్‌క్వాస్ గుర్తింపునకు అర్హత సాధించింది. ఈ గుర్తింపు ద్వారా పల్లె దవాఖానాలో మరిన్ని వసతులు కల్పనకు ప్రత్యేకంగా నిధులు అందనున్నాయి. ఆరోగ్య ఉపకేంద్రం ఎన్‌క్వాస్ గుర్తింపు సాధించడం ద్వారా వైద్యాధికారి నిఖిరాజ్, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను రిమ్స్ అవుట్‌పోస్టు పోలీసులు వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పట్టణానికి చెందిన వారు సోమవారం ఉదయం తల్లిదండ్రులతో కలిసి ఆస్పత్రికి వచ్చారు. ఇద్దరు చిన్నారులు ఏడుస్తూ స్థానికులకు కనిపించారు. వారు అవుట్‌పోస్టు పోలీసులకు ఈ విషయాన్ని తెలియజేయడంతో ఇద్దరు పిల్లలను కానిస్టేబుల్ వెంకటి తమ వద్ద ఉంచి తల్లిదండ్రుల కోసం గాలించి వారికి అప్పగించారు.

నెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు శిరీష


శిరీష

కుంటాల: జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు మండలంలోని అంబకంటి తండాకు చెందిన కె.శిరీష ఎంపికైనట్లు నెట్‌బాల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.అనిల్ కుమార్, జి.మోహన్ తెలిపారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో 6వ తెలంగాణ నెట్‌బాల్ చాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 22 నుంచి 26వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే 41వ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా పెటా సంఘం బాధ్యులు బుక్య రమేష్, భోజన్న, రమణరావు, జమున, భూమన్న, గంగాధర్ ఆమెను అభినందించారు.

ఇరువురిపై అట్రాసిటీ కేసు

జన్నారం: కులం పేరుతో దూషించి, బెదిరించిన వ్యక్తిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఈ నెల 13న జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన మురిమడుగుల దస్తగిరిని అదే గ్రామానికి చెందిన బాల్తా రాజమౌళి, బాల్తా సంతోష్ కులం పేరుతో దూషించారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్యకేసులో జీవిత ఖైదు

ఆసిఫాబాద్: మద్యం మత్తులో డబ్బులకోసం హత్యకు పాల్పడిన వాంకిడి మండలం కేడీగాంకు చెందిన ఆత్రం బొజ్జిరావుకు జీవిత ఖైదుతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానాలోని రూ. 50 వేలు మృతుని కుటుంబానికి చెల్లించాలన్నారు. లైజన్ అధికారి మహ్మద్ బషీర్ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం. వాంకిడి మండలం సర్కేపల్లికి చెందిన తండ్రీకొడుకులు కోవ జలపతిరావు, కోవ మాణిక్‌రావు జనవరి1, 2020న పత్తి అమ్మగా రూ.30 వేలు వచ్చాయి. డబ్బులు తీసుకుని వాంకిడి నుంచి ఆటోలో ఇంటికి బయలుదేరారు. అప్పుడే అక్కడికి వచ్చిన ఆత్రం బొజ్జిరావు బైక్‌పై జలపతిని తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో మద్యం కొనుగోలు చేసి పత్తి చేనులో సేవించారు. జలపతిరావు మత్తులోకి వెళ్లడంతో బొజ్జిరావు అతని తలపై బండరాయితో మోది హతమార్చాడు. అతని వద్దనున్న రూ.30 వేలు తీసుకుని పారిపోయాడు. మృతుని కుమారుడు మాణిక్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

ఆదర్శ కళాశాల

- ఐఐటీ, ఎన్ఐటీలో రాణిస్తున్న విద్యార్థులు
- జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో సైతం
- ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రథమ ప్రిన్సిపల్‌గా అవార్డు

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థులు వసతి గృహాల్లో, గురుకులాల్లో ఉంటూ పదో తరగతి, ఇంటర్మీడియేట్ వరకు చదివి ఉన్నత చదువులు చదువుకోలేక మధ్యలోనే అనేక మంది మానేస్తున్నారు. దీంతో ప్రభుత్వం 2017–18 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 22 డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (బోథ్)ను ఏర్పాటు చేసింది. ప్రారంభ విద్యా సంవత్సరంలో బీఏ (హెచ్‌ఈపీ), బీకాం (జనరల్), బీఎస్సీ (ఎంపీసీ), బీజెడ్‌సీ గ్రూపులతో ప్రవేశాలకు అవకాశం కల్పించింది. 80మంది విద్యార్థులతో ప్రారంభమై ప్రస్తుతం 350మంది ప్రతీ విద్యా సంవత్సరం విద్యను అభ్యసిస్తూ వంద శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలోనే మొదటిస్థానంలో నిలుస్తోంది.

జాతీయ స్థాయి యూనివర్సిటీలకు ఎంపిక...

దేశ వ్యాప్తంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేరళ, తమిళనాడు, రాజస్థాన్, పాండిచ్చేరి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌ల్లో పీజీలో సీట్లు సాధించి ఆదిలాబాద్ జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలుపుతున్నారు ఇక్కడి గిరి విద్యార్థులు. 2017–18 విద్యా సంవత్సరం నుంచి గత విద్యా సంవత్సరం వరకు 40మంది విద్యార్థులు ఆయా రాష్ట్రాలోని విశ్వవిద్యాలయాల్లో వివిధ సబ్జెక్ట్‌ల్లో పీజీ సీట్లు సాధించి ఉన్నత చదువులు చదువుతున్నారు.


టేకం సాయికిరణ్‌ను అభినందిస్తున్న అప్పటి ఐటీడీఏ పీవో (ప్రస్తుత నిర్మల్ జిల్లా కలెక్టర్) వరుణ్‌రెడ్డి

అథ్లెటిక్‌లో మంచి గుర్తింపు..

గిరిజన డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో చదువుతున్న 20మంది విద్యార్థులు అథ్లెటిక్ ఫుట్‌బాల్, వాలీబాల్, తదితర క్రీడల్లో జాతీయ స్థాయిలో సైతం రాణించారు. మరో విద్యార్థి జాతీయ స్థాయి క్రికెట్‌లో సైతం రాణించిన సందర్భాలు ఉన్నాయి.

ఉద్యోగాల్లో ముందంజలో..

అక్కడ విద్యాభ్యాసం చేసిన పలువురు విద్యార్థులు వివిధ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఫార్మా కంపెనీలో 11మంది, ఆర్మీలో నలుగురు, బీఎస్ఎఫ్‌లో మరో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. అంతేకాకుండా సాంకేతిక రంగంలో సైతం రాణిస్తున్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.


ఉత్తమ ప్రిన్సిపల్‌గా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ శ్రీనివాస స్వామి

ఈజిప్టు దేశానికి ఇద్దరు విద్యార్థులు..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన జి.సురేందర్, టేకం సాయికిరణ్ అనే ఇద్దరు విద్యార్థులు గత ఏడాదిన్నర కిందట ఈజిప్టు దేశ విద్యా విధానాన్ని అధ్యాయనం చేయడానికి వెళ్లారు. అక్కడి విద్యా విధానంపై 45 రోజుల పాటు అధ్యాయనం చేశారు. వీరికి సంబంధించిన ఖర్చు మొత్తం ప్రభుత్వామే భరించింది.

ప్రత్యేక శిక్షణ

ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అక్కడి అధ్యాపకులు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా శిక్షణను ఇవ్వడంతోనే ఆయా రంగాల్లో రాణిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు పేర్కొంటున్నారు.

బెస్ట్ ప్రిన్సిపల్‌గా అవార్డు..

కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస స్వామి ఇటీవలం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ, హోంశాఖ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ప్రథమ అవార్డును అందుకున్నారు.

ప్రారంభం నుంచే ఐఐటీ, ఎన్ఐటీలో రాణింపు..

2017–18 విద్యా సంవత్సరంలో ప్రారంభమైన గిరిజన రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థులు వివిధ ఉన్నత కోర్సులకు ఎంపికవుతున్నారు. ప్రారంభ విద్యా సంవత్సరంలోనే ఐదురుగు విద్యార్థులు ఇండియన్ ఆఫ్ టెక్నాలజీ, మరో ఎనిమిది మంది విద్యార్థులు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో రాణించారు. అలాగే మరికొంత మంది విద్యార్థులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రాణించారు. దీంతో పాటు ఎంబీఏ, ఎంసీఏలలో సైతం అనేక మంది విద్యార్థులు రాణిస్తున్నారు.


ఎన్ఐటీ, ఎంబీఏ సాధించిన విద్యార్థులతో సెక్రటరీ రొనాల్డ్ రోస్

పోలీసులమని చెప్పి చైన్ స్నాచింగ్


పోలీసులు అనుమానిస్తున్న వాహనం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసులమని చెప్పి బంగారు గొలుసు దొంగలు ఎత్తికెళ్లిన ఘటన మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండల కేంద్రానికి చెందిన రమ ఆమె బావతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ పట్టణానికి వచ్చింది. ఆమె బంధువులు ఆస్పత్రిలో ఉండడంతో వారిని చూసి తిరుగు పయనం అయ్యారు. ఈ క్రమంలో పట్టణంలోని జీఎస్ ఎస్టేట్ సమీపంలోని గణేష్ మందిర్ దాటిన తర్వాత ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చారు. తాము పోలీసులమని వారిని నమ్మబలికారు. ఈ రోడ్డు గుండా దొంగతనాలు జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును సంచిలో వేయించారు. ఆమె బావ మోహన్ వద్దని చెప్పాడు. అతన్ని పక్కకు నెట్టివేసి ఆ సంచిని ఎత్తుకెళ్లి పరారయ్యారు. కాగా మోహన్ తలకు గాయమైంది. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. అయితే ద్విచక్ర వాహనాన్ని గుర్తించినట్లు సమాచారం.

గర్భిణులకు గాయాలు

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ మండలంలోని చిట్యాల వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గర్భిణులకు గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై చంద్రమోహన్, స్థానికుల కథనం ప్రకారం... దిలావర్‌పూర్ మండలం కాల్వ తండా గ్రామానికి చెందిన శిరీష, సోను, శిల్ప, మోతిబాయి, సోనీ గర్భిణులు మంగళవారం తమ స్వగ్రామం నుంచి ఆటోలో జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వచ్చారు. అనంతరం స్వగ్రామానికి వెళ్తుండగా మండలంలోని చిట్యాల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టగా వారికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించి ఇంటికి పంపించారు.

బీఆర్ఎస్‌లోనే ఉంటా...రెబల్‌గా పోటీ చేస్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్‌లోనే ఉంటా... రెబల్‌గా పోటీ చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అంజీ, దనోరా(బి) గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ముందుగా గణేష్ మండపాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి అభివృద్ధి పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను అధికారులు ఆపడం సరైన పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ తనపై ఎన్ని కుట్రలు చేసినా ఆగేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గానికి ఏమి చేశాడని, ఓట్లు అడిగే అధికారం జాన్సన్ నాయక్‌కు లేదన్నారు. ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేశానని తెలిపారు. తొమ్మిదేళ్లలో ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఈశ్వర్‌నగర్ సర్పంచ్ శారదా, ఎంపీటీసీలు స్వర్ణలత, ఆశబాయి ఉన్నారు.


సర్పంచ్ కుసుంబాయితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

అనుమానాస్పదంగా ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో ఒకరు అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ సుల్తాన్ (26)కు ఆదివారం అర్ధరాత్రి 12.10 గంటలకు అష్రఫ్ అనే వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. రియల్ ఎస్టేట్‌కు సంబంధించి చర్చించేందుకు ఆయన ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరి వెళ్లినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. గాంధీనగర్– ఇందిరానగర్ మధ్యలో సోమవారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో వాహనం ఢీకొనగా మృతిచెందినట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడి భార్య ఫర్హాన తన భర్త రోడ్డు ప్రమాదంలో మరణించలేదని, ఎవరో హత్య చేసి ఉంటారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


మహ్మద్ సుల్తాన్ (ఫైల్)

పెళ్లికి నిరాకరించిన ప్రియుడిపై కేసు

ఇచ్చోడ: పెళ్లికి నిరాకరించిన ప్రియుడు చందల హరీశ్‌తో పాటు అతడి తల్లిదండ్రులు చందల ముత్తన్న, ఇంద్రలక్ష్మిలపై మంగళవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... కడెం మండలంలోని ముసాయిపేట్ గ్రామానికి చెందిన సుజాత, ఇచ్చోడ మండల కేంద్రంలోని టీచర్ కాలనీకి చెందిన హరీశ్ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో 18 నెలల క్రితం ప్రియుడి ఇంటి ముందు ధర్నాకు దిగింది. దీంతో హరీశ్ కుటుంబంతో సహా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి సుజాత ఆ ఇంటిలోనే ఉంటుంది. అయితే ఈ నెల 17న పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా హరీశ్ పెళ్లికి నిరాకరించాడు. దీంతో సుజాత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. పోలీస్‌స్టేషన్ గేటు ఎదుట సుజాత పురుగుల మందుతాగింది. కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి హరీశ్‌తో పాటు అతడి తల్లిదండ్రులను రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా గౌరి గ్రామానికి చెందిన ఆడె ఉమేష్ (43) అత్తారింటి గ్రామమైన ఘాటంజి తాలుకా చిరోలి గ్రామానికి వెళ్లి వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి కేకలు వేయడంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదేరోజు రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగుడుకు బానిసై..

నిర్మల్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది రూరల్ ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అల్లకొండ గంగాధర్ (38) ఆరోగ్యం బాగా లేకపోవడంతో తాగుడికి బానిసయ్యాడు. పనిదొరకక, జీవితంపై విరక్తితో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడు..


విష్ణువర్ధన్ (ఫైల్)

నేరడిగొండ: మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వడూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న వివరాల ప్రకారం.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మునిగొట్ల శోభకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన నర్సయ్యతో గతంలో వివాహమైంది. ఈ దంపతులకు కుమారుడు విష్ణువర్ధన్, కూతురు సంధ్య ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం నర్సయ్య భార్య శోభను వదిలిపెట్టడంతో ఆమె తన పిల్లలతో పుట్టింట్లోనే ఉంటోంది. వీరి బాగోగులు చూసుకుంటున్న ఆమె తండ్రి పర్వతం శంకర్ అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి శోభ తండ్రి వద్దే ఉంది. ఈ క్రమంలో ఆమె కుమారుడు విష్ణువర్ధన్ (17) నేరడిగొండ అటవీ ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న తల్లి సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నీటిసంపులో పడి యువకుడి మృతి


జాదవ్ శేషరావ్ (ఫైల్)

తానూరు: నీటిని తోడుతుండగా ప్రమాదవశాత్తు మిషన్ భగీరథ నీటిసంపులో పడి యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని హిప్నెల్లితండాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... హిప్నెల్లితండా గ్రామానికి చెందిన మచ్చేందర్, పారుబాయి దంపతుల పెద్ద కుమారుడు శేషరావ్(17) మంగళవారం తండ్రితో మందు కొట్టేందుకు వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సమీపంలోని మిషన్ భగీరథ సంపు నుంచి నీటిని తోడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. తండ్రి గమనించేలోగా మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సందీప్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ముగిసిన యువకుల అంత్యక్రియలు

తాంసి: మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని చిక్కల్‌ధార ఘాట్ సెక్షన్‌లో ఆదివారం ఉదయం వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అర్లి(టి) గ్రామ సర్పంచ్ గోల్లి రమ లస్మన్న కుమారుడు వైభవ్(28)తో పాటు అదే గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ షేక్ సల్మాన్ (31) మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం యువకుల మృతదేహాలను స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అందరితో కలివిడిగా ఉండే యువకులు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలియడంతో అంత్యక్రియల్లో పెద్దఎత్తున్న గ్రామస్తులు తరలివచ్చారు. అలాగే ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ సంతోష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

దగ్గరుండి సాయమందించి..

మహారాష్ట్రలోని అమరావతి జిల్లా సమీపంలోని చిక్కల్‌ధార పర్యాటక ప్రాంతం దగ్గర జరిగిన ప్రమాదంలో బాధితులకు భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన ఏనుగు నవీన్ రెడ్డి ఎంతో కృషి చేశారు. నవీన్‌రెడ్డి అమరావతిలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తెలంగాణకు చెందిన కారు ఆదివారం ఉదయం లోయలో పడిన విషయాన్ని వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలుసుకొన్న నవీన్‌రెడ్డి వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నాడు. ప్రమాద స్థలంలో పడి ఉన్నవారిని స్థానికుల సాయంతో అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించాడు. అక్కడి ఆస్పత్రిలో త్వరగా వైద్యసేవలు సైతం అందించే విధంగా తనవంతుగా చేయూత అందించాడు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగురామన్న

నిధులు ఆపే హక్కు మీకెక్కడిది?

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్
- అటవీ అనుమతుల కోసం మంత్రికి దండం పెట్టిన..
- సెక్యూరిటీ తొలగింపుపై ఆగ్రహం

ఖానాపూర్: 'అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు ప్రతీ ఎమ్మెల్యేకు చట్టబద్ధంగా వస్తాయి. వాటిని ఆపే హక్కు మీకెక్కడిది. నా కోటాలో రావాల్సిన నిధులను జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిలిపివేయించారు. నిధులు విడుదల చేయకుంటే ధర్నా చేస్తా.. అవసరమైతే దీక్షకు కూడా వెనుకాడను' అని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ హెచ్చరించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అటవీ అనుమతుల కోసం మంత్రికి దండం పెట్టినా స్పందించడం లేదని, తన నియోజకవర్గంలో మాత్రం అనుమతులు ఇచ్చుకున్నారని ఆరోపించారు. ఖానాపూర్‌లోని ఆమె నివాసంలో మాట్లాడారు. రూ.2.25 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ నిధులను కావాలనే నిలిపివేయిస్తున్నారని తెలిపారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని అయినా తన హయాంలో అభివృద్ధి జరగలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

భద్రత తగ్గించారు..

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ స్థానిక సీఐ తనను పట్టించుకోవడం లేదని, ఒక పోలీస్ అధికారి అయి ఉండి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. ఇదివరకు తన ఇంటి వద్ద ఎస్బీ కానిస్టేబుల్‌తోపాటు హోంగార్డు, సిబ్బంది ఉండేవారని, తాను ఎటు వెళ్లినా తన వెంట ఎస్కార్ట్ ఉండేదని తెలిపారు. ప్రస్తుత సీఐ తన భద్రత తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. జాన్సన్‌నాయక్‌కు ఏ హోదా ఉందని ఎస్కార్ట్ ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రెబల్‌గా పోటీ చేస్తా

తాను వచ్చే ఎన్నికల్లో ఖానాపూర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థిగానే పోటీ చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. ఖానాపూర్ మున్సిపాలిటీ, కొత్త మండలాలు తన హయాంలోనే చేశానన్నారు. రూ.5 కోట్లు కడెం ప్రాజెక్టు రిపేరుకు వచ్చాయని, ఆ నిధులు ఎటు వెళ్లాయో తెలియదన్నారు. జాన్సన్ నాయక్ ఓటమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

సిక్కిం నుంచి పొన్కల్‌కు..

- 8 ఏళ్ల తర్వాత ఇంటికి వచ్చిన మహిళ
- కుటుంబ సభ్యులకు అప్పగించిన సేవా సంస్థ సభ్యులు

మామడ: అయిన వారిని మర్చిపోతున్న ఈ రోజుల్లో మతిస్థిమితం లేని మహిళను వృద్ధాశ్రమంలో చేర్చుకోవడంతోపాటు ఏళ్లుగా సేవ చేశారు. ఆచూకి తెలుసుకుని 8 ఏళ్ల తర్వాత కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన రాజారపు నడిపి బుచ్చవ్వకు కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. 2015 సంవత్సరంలో ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రదేశాలలో వెతికారు. తెలిసిన వారిని అడిగారు. జాడమాత్రం దొరకలేదు.

సిక్కిం టూర్‌తో వెలుగులోకి.....

నల్గొండకు చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యుడు అఖిల్ తన మిత్రులతో కలిసి గత నెలలో ఈశాన్య రాష్ట్రాల సందర్శనకు వెళ్లాడు. ఈ క్రమంలో సిక్కిం రాష్ట్రంలో పర్యటించారు. అక్కడ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న బుచ్చవ్వ తెలుగులో మాట్లాడగా వివరాలు సేకరించి తన మిత్రులకు సమాచారం అందించారు. దీంతో ఫోన్ ద్వారా ఫొటోలు పంపించగా కుటుంబ సభ్యులు బుచ్చవ్వను గుర్తించారు. బుచ్చవ్వను స్వగ్రామానికి చేర్చాలని వృద్ధాశ్రమ నిర్వాహకులను వేడుకోగా వారు స్పందించారు.


పొన్కల్‌లో కుటుంబ సభ్యులతో బుచ్చవ్వ

ఎనిమిదేళ్ల తర్వాత స్వగ్రామానికి....

1800 కిలోమీటర్‌లకు పైగా దూరంలో ఉన్న సిక్కిం రాష్ట్రం నుంచి స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు బెనితా బుజాల్ ఆధ్వర్యంలో సిక్కింలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు పసంగ్‌కిట్‌తోపాటు నల్గొండకు చెందిన స్వచ్ఛంద సంస్థ సభ్యుడు అఖిల్ ఆరు రోజులు ప్రయాణించి బుచ్చవ్వను స్వగ్రామం పొన్కల్‌కు తీసుకువచ్చారు. గ్రామస్తుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుటుంబ సభ్యుల ఆనందం..

ఎనిమిదేళ్ల తర్వాత బుచ్చవ్వ ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఇక లేదనుకున్న బుచ్చవ్వ ఆచూకీ లభించడంతో యోగక్షేమాలు తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.